క్లుప్తంగా

చెకుముకి పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

కల్లూరు(పులిచెర్ల): పలమనేరులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీల్లో కల్లూరు హైస్కూలు విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పదవ తరగతికి చెందిన కుష్ నిహాజ్, 9వ తరగతికి చెందిన గౌతమ్, 8వ తరగతి చెందిన దీక్షిత పోటీల్లో బహుమతులు అందుకున్నట్టు తెలియజేశారు.

డిగ్రీ కళాశాలలో విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న గోవిందరాజు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుభారాం ట్రస్ట్ చైర్మన్ దివంగత రామమూర్తిశెట్టి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆదివారం కళాశాలలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ట్రస్ట్ సభ్యులు గోవిందరాజులు, సాయి శ్రీనివాసమూర్తి, ప్రకాష్, ప్రసాద్, సౌమ్య, వాసవి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రామమూర్తిశెట్టి సేవలను ప్రస్తుతించారు. కళాశాల అభివృద్ధికి అన్నివేళలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఆర్యవైశ్యులు, విద్యార్థులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నరేంద్ర రెడ్డి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం జయకుమార్ రెడ్డి ఆదివారం తెలిపారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన అండర్-19 యోగా పోటీలలో అతను ప్రతిభ చూపడంతో ఎంపికయ్యాడని, సోమవారం రాయచోటిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో అతడు పాల్గొంటాడని చెప్పారు. అతడికి శిక్షణ ఇచ్చిన పీడీలు కిశోర్, రెడ్డి ప్రవీణను అభినందించారు.

డీఎల్ఈడీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్న డీఎల్ఈడీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లాలో వచ్చే నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు డీఎల్ఈడీ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా కసరత్తు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు సంబంధిత షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

సరిహద్దులు దాటుతున్న

కృత్రిమ ఇసుక



గతనెల మల్లానూరు గ్రామస్తులు అర్ధరాత్రి పట్టుకున్న తమిళనాడుకు తరలుతున్న ఇసుక ట్రాక్టర్ (ఫైల్)

కుప్పం నియోజకవర్గంలో కృత్రిమ ఇసుక అక్రమ రవాణా మూడు ట్రాక్టర్లు..ఆరు టిప్పర్లు అన్న చందాన సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు అక్రమార్జనకు మళ్లీ కృత్రిమ ఇసుక తయారీని ఎంచుకున్నారు. నియోజకవర్గంలో సహజసిద్ధమైన ఇసుక లభ్యత అతితక్కువ. దీంతో కృత్రిమ ఇసుక తయారీ అక్రమార్కులకు సిరులు కురిపిస్తోంది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండవ సారి సీఎంగా చంద్రబాబునాయుడు ఉన్నప్పుడు నియోజకవర్గంలో కృత్రిమ ఇసుక తయారీని నిషేధిస్తూ నిషేధిస్తూ ఉత్తర్వులిచ్చారు. దాదాపు దశాబ్దం క్రితం వరకు రెండు కృత్రిమ ఇసుక తయారీ యూనిట్లు ఉంటే, ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో వందల్లో యూనిట్లు వెలిశాయి. బాబు నిషేధ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ తెలుగు తమ్ముళ్లే కృత్రిమ ఇసుక తయారీతో జేబులు నింపుకుంటున్నారు. దీనికి చెక్ పెట్టాల్సిన అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది.

- యథేచ్ఛగా రాత్రి పూట అక్రమ రవాణా
- అక్రమార్కులకు డబ్బే..డబ్బు..!
- అక్రమ రవాణాలో తమ్ముళ్లదే కీలకపాత్ర
- వాహనాలకు టీడీపీ ముఖ్యనేత స్టిక్కర్ ఉంటే రైట్..రైట్!
- దశాబ్దం క్రితం రెండు కృత్రిమ ఇసుక తయారీ యూనిట్లు
- కూటమి అధికారంలోకి వచ్చాక వందల్లో వెలిసిన వైనం!
- కృత్రిమ ఇసుక తయారీని చంద్రబాబు నిషేధించినా పట్టించుకోని తమ్ముళ్లు
- చేష్టలుడిగి చూస్తున్న పోలీసు, రెవెన్యూ యంత్రాంగం

కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, కుప్పం మండలాల్లోని కొన్ని గ్రామాలు సరిహద్దులుగా ఉండడంతో కృత్రిమ ఇసుక అక్రమ రవాణాదారుల పంట పండుతోంది. సరిహద్దు గ్రామాల్లో కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని వాటి నుంచి పగటిపూట పోగు చేసుకున్న ఇసుక రాత్రిపూట సరిహద్దు చెక్‌పోస్టుల గుండా యథేచ్ఛగా తమిళనాడుకు చేరవేస్తున్నారు. తమిళనాడులో ఇసుకకు డిమాండ్ ఉండడం ఇక్కడి అక్రమార్కులకు కలిసి వస్తోంది. కుప్పంలో కృత్రిమ ఇసుక తయారీదారుల నుంచి ట్రాక్టర్ ఇసుక రూ.1000కి కొనుగోలు చేసి రాత్రి టిప్పర్ల సాయంతో తమిళనాడుకు చేరవేస్తున్నారు. తమిళనాడులో ఐదు ట్రాక్టర్ల ఇసుక పట్టే టిప్పర్ ధర రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతోంది. దీంతో అన్ని ఖర్చులు పోను టిప్పర్‌పై అక్రమార్కులకు 8 వేల నుంచి 10 వేలు మిగులుతుండడంతో చాలా మంది అక్రమ రవాణాను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. తమిళనాడులోని తిరుపత్తూరు, వాణియంబాడి, నాట్రాంపల్లె, వేలూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. 20 నుంచి వంద కిలోమీటర్ల దూరంలోని తమిళనాడు ప్రాంతాలకు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

అక్రమ రవాణాలో తమ్ముళ్లదే పైచేయి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు గ్రానైట్, తమిళనాడు బియ్యం, ఇసుక అక్రమ రవాణాలో ఎవరి వారే పైచేయి సాధించాలని కనబడిన ప్రతి దాంట్లో అక్రమార్జనకు దిగుతున్నారు. దీనికి తోడు స్థానికేతరుడైన నియోజకవర్గ బాధ్యుడైన ఓ ముఖ్య నాయకుడు టీడీపీ స్టిక్కర్ ఉండి, డ్రైవింగ్ లైసెన్సు, వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉంటే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వారిని అడ్డుకోవద్దని అనధికారిక ఆదేశాలు ఇవ్వడంతో అక్రమార్కులకు మరింత బలాన్ని ఇచ్చింది. కుప్పం మండలంలోని అడవిబూదుగూరు, కొటాలూరు, మల్లానూరు ప్రాంతాల నుంచే పెద్ద ఎత్తున ఇసుక తమిళనాడుకు అక్రమంగా తరలుతోందని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు. ఇందుకు నిదర్శనమే గత నెలలో తమిళనాడుకు అక్రమంగా తరలుతున్న ఒక ట్రాక్టర్‌ను అర్ధరాత్రి మల్లానూరు గ్రామస్తులు పట్టుకోవడం.

రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఉదాసీనత

గ్రానైట్ తరహాలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడం, దీనికితోడు ఇక్కడి టీడీపీ నాయకులను పట్టుకుంటే పై నుంచి ఒత్తిళ్లు తప్పవనే భయంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు. మరోవైపు టీడీపీ స్టిక్కర్ ఉంటే వదిలి పెట్టాలని అనధికారిక ఆదేశాలు ఉండడంతో అధికారులు అక్రమార్కులకు కళ్లెం వేసే విషయంలో ఎందుకొచ్చిన గొడవని మౌనం వహిస్తున్నారు. సరిహద్దుల్లోని గ్రామాల్లో ఒక్కో గ్రామంలో నాలుగు నుంచి ఐదు కృత్రిమ ఇసుక తయారీ యూనిట్లు వెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

కృత్రిమ ఇసుకతో భవనాలు కడితే నష్టదాయకం!

వాస్తవానికి కృత్రిమ ఇసుకతో ఇళ్లు, భవనాలు నిర్మిస్తే పటుత్వం లేక, నాణ్యతా ప్రమాణాలు ఉండవని, సహజసిద్ధమైన ఇసుకతో పోల్చితే ఇది అన్నివిధాలా కొనుగోలుదారులకు నష్టదాయకమే. ఇది కృత్రిమ ఇసుక అని చెప్పకుండా తమ్ముళ్లు దర్జాగా జేబులు నింపుకుంటున్నారు.

ప్రభుత్వ టీచర్‌కు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న గురుస్వామి

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న రొంపిచెర్ల గ్రామ పంచాయతీ వారణాసివారిపల్లెకు చెందిన ఎం.గురుస్వామికి తమిళనాడు రాష్ట్రంలోని ఓ సంస్థ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 35 ఏళ్లుగా గురుస్వామి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తెలుగు టీచర్‌గా పని చేస్తున్నారు. ఓ వైపు ఉపాధ్యాయ వృతిలో రాణిస్తూనే మరో వైపు రంగస్థలంలో తన ప్రతిభ చాటుతున్నారు. పద్యాలుపాడటం, ప్రదర్శనలు ఇవ్వడం, బృందాలుగా ఏర్పడి గ్రామాల్లోకి వెళ్లి జానపద పాటలు పాడటం, సామాజిక సమస్యలను రూపుమాపేందుకు తనవంతుగా వందల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆసియా ఇంటర్నేషనల్ అల్చరల్ యూనివర్శిటీ ఆయనకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ నెల 26న తమిళనాడులోని హోసూరులో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం గురుస్వామి తిరుపతిలోని బైరాగిపట్టెడ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పని చేస్తున్నారు.

నియామకం



సీతాపతి

సదుం: భారతీయ అంబేడ్కర్ సేన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండలానికి చెందిన సీతాపతిని నియమించినట్లు ఆ సేన జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం వ్యవస్థాపకులు శివప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ గణపతి సూచనల మేరకు ఆయనను నియమిస్తున్నట్లు తెలియజేశారు. బహుజన వర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని సీతాపతి చెప్పారు.

బోయకొండకు వాల్మీకుల పాదయాత్ర



బోయకొండకు పాదయాత్రగా వెళ్లిన వాల్మీకి కుల సంఘ నాయకులు

పుంగనూరు: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని, బోయకొండ చైర్మన్ పదవి వాల్మీకులకు ఇవ్వాలని ఆ కుల సంఘ నాయకులు ఆదివారం బోయకొండకు పాదయాత్ర చేశారు. పట్టణంలోని పూలే విగ్రహానికి ఆ కుల సంఘ నాయకులు శ్రీనివాసులు, అద్దాల నాగరాజ ఆధ్వర్యంలో వాల్మీకి కులస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకుల సమస్యల పరిష్కారం కోసం బోయకొండకు పాదయాత్రగా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.



పుంగనూరు బైపాస్ రోడ్డులో మరమ్మతులు చేసిన రోడ్డు

రోడ్డులో గుంతలు పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్..

పుంగనూరు: పట్టణంలోని పీఎల్ఆర్ మినీ బైపాస్ రోడ్డులో మంజునాథ కళ్యాణ మండపం వద్ద పడిన గుంతలను ఆదివారం సిమెంటు వేసి పూడ్చారు. 'రోడ్లు ఛిద్రం..ప్రయాణం నరకం' అనే శీర్షికతో ఈనెల 20న పట్టణంలోని రోడ్ల దుస్థితిపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ అధికారులు ఒక రోడ్డులోని గుంతలను మాత్రమే పూడ్చి వేశారు. మిగిలిన రోడ్లను కూడా పూడ్చవలసి ఉంది.

నేడు ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

కుప్పం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ప్రజా సమస్యలపై సోమవారం వినతులు స్వీకరించనున్నట్లు కడా కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. కడా కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరిస్తామని, దీనిని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

చిత్తూరులో ఐశ్వర్య రాజేష్ సందడి



మీడియాతో మాట్లాడుతున్న ఐశ్వర్య రాజేష్

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులో ఆదివారం సినీ నటి ఐశ్వర్య రాజేష్ సందడి చేసింది. పలమనేరు రోడ్డులోని జోస్ అలుకాస్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతికి వస్తున్న సినిమా పూర్తి కావస్తోందని తెలిపారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మరో సినిమా ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అభిమానులకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



39 సంవత్సరాల తర్వాత కలుసుకున్న రొంపిచెర్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రొంపిచెర్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక కళ్యాణ మండపంలో కలుసుకున్నారు. రొంపిచెర్ల ఉన్నత పాఠశాలలో 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఈ సమ్మేళనం నిర్వహించారు. కుటుంబ పరిస్థితులు, యోగక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. మదనపల్లె, పీలేరు, చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన అప్పటి బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో చదువుకున్న తమ మిత్రుల్లో చాలావరకు ఉన్నత స్థాయిలో ఉండడం ఆనందంగా ఉందని సహచరులు హర్షం వ్యక్తం చేశారు. తమ మిత్రులు ఎవరైనా అనారోగ్యంతోగానీ, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నపక్షంలో వారికి తమవంతు సాయంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణారెడ్డి, శివశంకర్ నాయుడు, హరినాథ, చంద్రశేఖర్ ఆచ్చారి, వినోద్‌కుమార్, గురుస్వామి, మునేంద్ర, రెడ్డెప్పనాయుడు, వంకాయల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. వరి రైతుకు నష్టం



మిట్టపల్లె వద్ద నేలకొరిగిన వరి పంట

బైరెడ్డిపల్లె: ఇటీవల కురిసిన వర్షాలకు వరి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి ప్రస్తుతం పొట్టదశలో పైరు పూర్తిగా నేలకొరిగి 60 శాతం వరకు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. గతేడాది వరి పంటకు గిట్టుబాటు ధర పలకడంతో ఈసారి చాలా మంది రైతులు అధికంగా వరి సాగు చేశారు. పొట్టదశలో ఉన్న వరి పంట నవంబర్ రెండో వారంలో చేతికి వస్తుందన్న తరుణంలో వర్షం వల్ల పంట చాలా వరకు నేలకొరగడంతో దిగుబడి ఎకరాకు 10 బస్తాల వరకు తగ్గుతుందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెప్పారు. దీంతో పాటు టమాట పంటకు పూర్తిగా నష్టం వాటిల్లి తెగుళ్లు ఆశించాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కరకరలాడే చిప్స్‌కు..

బంగాళ దుంప సాగుతో ఆదాయం

- సాగులో మెలకువలు, సమగ్ర సస్యరక్షణ పాటిస్తే అధిక దిగబడి



మండలంలో సాగులో ఉన్న బంగాళాదుంప పంట

వి.కోట: చిత్తూరు జిల్లాలో బంగాళదుంపలో ఎక్కువగా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో పండిస్తున్నారు. సాధారణంగా బంగాళాదుంప పంట సాగుకు నీరు నిలువని సారవంతమైన ఎర్రనేలలు, గరప నేలలు అనుకూలం. అయితే వీటి సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం, విత్తనశుద్ధి, దుంపల సేకరణ, విత్తన ఎంపిక విషయంలో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని మండల ఉద్యానశాఖాధికారి లక్ష్మి ప్రసన్న చెప్పారు. ప్రధానంగా కరకరలాడే చిప్స్ తయారీకి ఇక్కడ బంగాళదుంపలు సాగు చేస్తుండటం గమనార్హం!

విత్తన రకాల ఎంపికలో తీసుకోవాల్సి జాగ్రత్తలు

బంగాళాదుంప పంటలో అధిక దిగుబడులను సాధించడానికి కుఫ్రిజ్యోతి,కుఫ్రిమేఘ, కుఫ్రి గిరిరాజ్ లాంటి రకాలు ప్రాంతాలను బట్టి వాడుతుంటారు. అయితే ఈ ప్రాంతాల్లో కుఫ్రి జ్యోతి రకం సాగులో ఉంది. అలాగే ఇటీవల కాలంలో ఎఫ్‌సీ-11 రకాన్ని చిప్స్ తయారీ కోసం సాగు చేయడం మొదలెట్టారు. దీనివల్ల నికర ఆదాయం పొందుతుండడంతో రైతులు దీని వైపు మొగ్గు చూపుతున్నారు.

విత్తనశుద్ధి, మోతాదుల ఎంపిక

దుంపలను విత్తన దుంపలుగానే వాడుతారు. తెగుళ్లు ఆశించని పొలం నుంచి విత్తనం దుంపలను సేకరించాలి. వాటి సైజును బట్టి ఎకరాకు 500 నుంచి 600 కిలోల విత్తనం దుంపలు అవసరమవుతాయి. వీటిని సేకరించిన తరువాత ఒక లీటరు నీటిలో 3గ్రాములు మాంకోజబ్ లేదా 2 గ్రాముల రడోమిల్ కలిపిన మందు ద్రావణంలో 5 నిమిషాలు ముంచిన తర్వాత తీసి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. దుంపలను మంచి నీటిలో శుభ్రపరచి 1 శాతం బ్లీచింగ్ పౌడర్ ద్రావణంలో ముంచి తర్వాత 3 శాతం బోరిక్ యాసిడ్ ద్రావణంలో 20-30 నిమిషాలు ముంచి నీడలో ఆరబెట్టాలి. తర్వాత విత్తుకుంటే బాక్టీరియా వాడుతెగులు విత్తనం ద్వారా సంక్రమించడం నివారణ సాధ్యమవుతుంది.

పొలం సిద్ధం చేయడం.. దుంపలు విత్తడం

బంగాళాదుంప సాగుకోసం ఎంపిక చేసుకున్న పొలాన్ని 3-4 సార్లు దుక్కిదున్ని చదును చేసుకోవాలి. చివరి దుక్కిలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వేసి కలపాలి. వాతావరణ పరిస్థితులను బట్టి సెప్టెంబర్ నెలలో మొదటి పంట, నవంబరు, డిసెంబర్ నెలల్లో రెండవ పంట విత్తుకోవాలి. పొలంలో 3 అడుగుల వెడల్పుతో ఎత్తు చేసి మడులు తయారు చేసుకుని బెడ్ మధ్యలో లేటరల్ పైపులు అమర్చుకోవాలి. లేటరన్ పైపులకు ఇరువైపులా 15 సెం.మీ దూరంలో 20 సెం.మీ మధ్య దూరంలో రెండు వరుసలుగా ఒక్కొక్క విత్తనం దుంప లేదా కత్తిరించిన దుంప భాగాన్ని విత్తుకోవాలి.

దుంప పంట సాగులో చేరు చీడపురుగులు రకాలు

బంగాళాదుంప పంటను పలురకాల చీడలు, తెగుళ్లు ఆశించి నష్టం కలుగజేస్తాయి. వీటిని వెంటనే గుర్తించి తగు నివారణ మందులను వాడడంతో వాటి నుంచి పంటను కాపాడుకోవచ్చు. ముఖ్యంగా బంగాళదుంప పంటలో లద్దెపురుగులు, తెల్లవేరు పురుగు, దుంపతొలిచేపురుగు, అక్షింతల పురుగు వంటివి ఆశించి పంటను పూర్తిగా నాశనం చేస్తుంటాయి.

లద్దెపురుగుల నివారణ

దుమ్ముతో కూడిన ఆకుపచ్చ రంగులో ఉండే లద్దె పురుగులు రాత్రివేళ లేత కొమ్మలను, నేల మట్టానికి కత్తిరించి లేత ఆకులు, కొమ్మలను తింటాయి. దీనివల్ల పంట నాశనం అయ్యే అవకాశం ఉంది. దీని నివారణకు చివరి దుక్కిలో ఎకరాకు 7 కిలోల 4 శాతం థయోడాన్ పొడి మందు చల్లుకోవాలి.

తెల్లవేరు పురుగు నిర్మూలనకు..

తెల్లని లార్వాలు మొదట వేర్లు ఆశించి తింటాయి. దుంపలు ఏర్పడిన తర్వాత దుంపల్లోకి రంధ్రాలు చేసి వాటిని తిని నష్టపరుస్తాయి. దీన్ని నివారణకు ఎకరాకు 4 కిలోల ఫోరేట్ లేదా 8 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు చివరి దుక్కిలో వేయాలి.

దుంప తొలిచే పురుగు నివారణకు..

లార్వాలు ఆకులపై దుంపలలో సొరంగాలు చేసి తొలిచి దుంపల నిల్వ సమయంలో సైతం నష్టం కలుగజేస్తాయి. విత్తన సమయంలో విత్తన దుంపలు కనీసం 10 సె.మీ.ల లోతులో నాటాలి. తవ్వినప్పుడు అన్ని దుంపలు పూర్తిగా సేకరించాలి. పురుగు ఆశించిన దుంపలను సేకరించి నాశనం చేయాలి.

అక్షింతల పురుగు ..

అక్షింతల పురుగు నివారణకు 1.25 గ్రాముల అసిఫైట్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

దిగుబడి ఎలా ఉంటుందంటే..

బంగాళదుంప పంట విత్తిన 70 నుంచి 80 రోజులకు దుంపలు వృద్ధి చెందుతాయి. వృద్ధి చెందిన తర్వాత నేలపై కొమ్మల భాగాన్ని కత్తిరించి నేలపై కప్పి క్యూరింగ్ చేస్తే దుంపలపై చర్మం గట్టి పడుతుంది. దుంపలు తవ్విన 10-15 రోజులు నీడలో ఆరబెట్టి గ్రేడింగ్ చేసి నిల్వ చేయాలి.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతులు బంగాళాదుంప పంట సాగు చేసే సమయంలో అధికారుల సూచనలు తీసుకుంటే మరింత దిగిబడులను సాధించవచ్చు. బంగాళాదుంప, వంగ, టమాట, మిరప పంటలు పండిన పొలంలో పంట మార్పిడి అనంతరమే బంగాళాదుంప పంటను సాగు చేసుకోవాలి. విత్తన సేకరణ, విత్తనశుద్ధిపై తగు జాగ్రత్తలు పాటించాలి. వి.కోట మండలంలో 80 మంది రైతులు 100 ఎకరాల్లో బంగాళాదుంప సాగు చేశారు.

–లక్ష్మీప్రసన్న, మండల ఉద్యాన శాఖాధికారిణి, వి.కోట

తెలుగు భాషా వికాసానికి పాటుపడదాం



సన్మానం అందుకున్న కవులు, బాషా పరిరక్షణకు కృషి చేస్తున్నవారు

పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృక సమితి స్ఫూర్తితో తెలుగు భాషా వికాసానికి తెలుగు వారందరూ కృషి చేయాలని ఆచార్య కిరణ్ క్రాంత్ పిలుపునిచ్చారు. స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి పుష్కరోత్సవం కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆముదాల మురళి మాట్లాడుతూ పిల్లలకు సంపాదన కంటే సంస్కారాన్ని నేర్పడం అలవరచుకోవాలన్నారు. అనంతరం తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని, కవులను సన్మానించారు. ఆపై వందలాది మంది పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తులసీనాథం నాయుడు, పుష్పా తదితరులు పాల్గొన్నారు.



బహుతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు